సాక్షి
నిజామాబాద్
బుధవారం • 1 • మే • 2024



ప్రమాదాల్లో ముగ్గురి మృతి

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. పలువురు గాయపడ్డారు.

- IIలో ▸



సాఫ్ట్‌బాల్‌లో ప్రతిభ

కర్ణాటకలో జరిగిన జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటారు.

- IIలో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
43.8 /30.1

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

93.72%

పది ఫలితాల్లో ఉత్తీర్ణత

రాష్ట్ర విద్యాశాఖ అధికారులు మంగళవారం విడుదల చేసిన పదో తరగతి ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటారు. గతేడాదితో పోలిస్తే మెరుగైన ఫలితాలు సాధించారు. 93.72 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్ర స్థాయిలో జిల్లా 14వ స్థానంలో నిలిచింది. 243 పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత నమోదు కాగా 284 మంది 10 జీపీఏ సాధించారు.



డీఈవో దుర్గాప్రసాద్‌ను అభినందిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

అమ్మాయిలదే పైచేయి

- 94.79 శాతం బాలికలు, 92.70 శాతం బాలురు పాస్
- 14వ స్థానంలో నిలిచిన జిల్లా
- 284 మందికి 10 జీపీఏ
- 243 పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత నమోదు

నిజామాబాద్ అర్బన్: పదో తరగతి ఫలితాల్లో జిల్లాలో బాలికలే పైచేయి సాధించారు. మంగళవారం వెలువడిన ఫలితాల్లో జిల్లాలో 93.72 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రాష్ట్రంలో జిల్లా 14వ స్థానంలో నిలిచింది. జిల్లావ్యాప్తంగా 21,858 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 20,486 మంది పాసయ్యారు. ఇందులో బాలురు 11,144 మందికి 10,330 మంది(92.70శాతం) ఉత్తీర్ణత సాధించగా, బాలికలు 10,714 మందికి 10,156 మంది (94.79 శాతం) ఉత్తీర్ణత సాధించారు. గతేడాది కంటే ఈ సారి జిల్లాలో మెరుగైన ఫలితాలు వచ్చాయి. పోయిన సారి జిల్లా 21వ స్థానంలో ఉండగా ఈ ఏడాది 14వ స్థానంలో నిలిచింది. జిల్లా వ్యాప్తంగా 243 పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. 284 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారు. గతేడాది 163 స్కూళ్లలో వంద శాతం ఉత్తీర్ణత నమోదుకాగా, 153 మంది 10 జీపీఏ సాధించారు. గతేడాది రెండు పాఠశాలల్లో జీరో శాతం ఉత్తీర్ణత నమోదు కాగా ప్రస్తుతం అన్ని పాఠశాలల్లో ఉత్తీర్ణత నమోదైంది.

ప్రభుత్వ బడుల్లో మెరుగైన ఫలితాలు

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం పెరిగింది. ఏడు ఎయిడెడ్ పాఠశాలల్లో 432 మంది(89.07 శాతం) పాసయ్యారు. ఐదు ఆశ్రమ పాఠశాలల్లో 170 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 93.92 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బీసీ వెల్ఫేర్ బడులు 12 ఉండగా ఇందులో 756 మంది (98.69 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ పాఠశాలలు 25 ఉండగా 865 మంది(77.16 శాతం) పాసయ్యారు. 25 కేజీబీవీల్లో 784 మంది(93.89 శాతం), పది మోడల్ స్కూళ్లలో 926 మంది(97.99 శాతం) ఉత్తీర్ణులయ్యారు. రెసిడెన్షినల్ పాఠశాలలు మూడు ఉండగా 207 మంది (వంద శాతం), 17 మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 655 మంది(95.76 శాతం) పాసయ్యారు. తొమ్మిది సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూళ్లలో 662 మంది (97.78 శాతం), 222 జిల్లా పరిషత్ పాఠశాలల్లో 6,766 మంది(92.76 శాతం) ఉత్తీర్ణత సాధించారు.

10 జీపీఏ సాధించిన విద్యార్థులు

పాఠశాలలు	బాలురు	బాలికలు
బీసీ వెల్ఫేర్	11	14
కేజీబీవీ	--	02
మోడల్	02	15
ప్రైవేట్ పాఠశాలలు	52	129
రెసిడెన్షియల్	--	04
మైనారిటీ రెసిడెన్షియల్	06	03
సోషల్ వెల్ఫేర్	--	10
జిల్లా పరిషత్	12	24
మొత్తం	83	201

మూడేళ్లుగా జిల్లాలో ఉత్తీర్ణత శాతం

సంవత్సరం	పరీక్ష రాసినవారు	ఉత్తీర్ణులైన వారు	శాతం
2021-22	22,243	20,651	92.84
2022-23	21,592	18,810	87.11
2023-24	21,858	20,486	93.72

వందశాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలు

మేనేజ్‌మెంట్	పాఠశాలలు
బీసీ వెల్ఫేర్	9
ప్రభుత్వ పాఠశాలలు	1
కేజీబీవీలు	12
మోడల్	4
ప్రైవేట్	85
రెసిడెన్షియల్	3
మైనారిటీ	8
సోషల్ వెల్ఫేర్	5
జిల్లా పరిషత్	116
మొత్తం	243

న్యూస్‌రీల్

ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



నిజామాబాద్‌అర్బన్: ఇంటర్‌లో ఫెయిలైన ప్రభుత్వ జూనియర్ కాలేజీల విద్యార్థులకు ప్రత్యేక తగరతులు నిర్వహిస్తామని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ తెలిపారు. ఇంటర్ ఫలితాలపై ప్రభుత్వ జూనియర్ కాలేజీల ప్రిన్సిపాల్స్‌తో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఇంటర్ బోర్డు నిర్ణయం మేరకు ఆయా ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్‌లు సబ్జెక్టుల వారీగా ఫలితాలను సమీక్షించి ఆయా సబ్జెక్టుల లెక్చరర్ల ద్వారా వెంటనే ప్రత్యేక తరగతులను ప్రారంభించాలని ఆదేశించారు. ఈ నెల 24 నుంచి నిర్వహించనున్న సప్లిమెంటరీ పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులు ఈ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఐదు కాలేజీల్లో ‘గుర్తింపు’ తనిఖీలు



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో 2024–25 విద్యా సంవత్సరానికి అనుబంధ గుర్తింపు కోసం డిగ్రీ, పీజీ కళాశాలల్లో నిర్వహిస్తున్న తనిఖీలు మంగళవారం కొనసాగాయి. ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ నేతృత్వంలో వర్సిటీ పరిధిలోని కామారెడ్డి జిల్లాలోని వశిష్ఠ, శ్రీవైష్ణవి, విజ్ఞాన భారతి, పీజేఆర్ స్ఫూర్తి, సాందీపని డిగ్రీ కాలేజీలలో తనిఖీలు నిర్వహించారు. యూజీసీ, రాష్ట్ర ఉన్నత విద్యామండలి, యూనివర్సిటీ నిర్దేశించిన నిబంధనల మేరకు వసతి సౌకర్యాలు ఉన్నాయా లేవా అనే అంశాలను పరిశీలించారు. సొంత భవనాలు, తగినన్ని తరగతి గదులు, క్రీడా మైదానం లేని కళాశాలల వారికి నోటీసులు అందజేసినట్లు చంద్రశేఖర్ తెలిపారు. ఈ తనిఖీల్లో ఆడిట్ సెల్ జాయింట్ డైరెక్టర్ అతిక్ సుల్తాన్ ఘోరీ, డీన్స్ రాంబాబు, ఆరతి, లావణ్య, ఇంగ్లిష్ విభాగాధిపతి రమణాచారి, రసాయనశాస్త్రం విభాగాధిపతి అడికె నాగరాజు పాల్గొన్నారు.

లారీకి ఏడు బస్తాలు కడ్తా

డొంకేశ్వర్(ఆర్మూర్): తరుగు లేదని చెప్పినే కడ్తా తీస్తున్నారని డొంకేశ్వర్ మండలం గంగాసముందర్ గ్రామానికి చెందిన కొంత మంది రైతులు ఆరోపిస్తున్నారు. సొసైటీకి విక్రయించిన వడ్లను లారీల్లో ఎక్కించిన తర్వాత మిల్లర్లు కడ్తా పేరుతో దోపిడి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన ట్రక్‌షీట్‌ను రైతులు మంగళవారం బయటపెట్టారు. రైతులు గ్రామంలో ఏర్పాటు చేసిన సొసైటీ కొనుగోలు కేంద్రంలో వడ్లను విక్రయించారు. జల్లపురం భోజన్న 74 బస్తాలు, అన్నకారి చిన్న గంగన్న 189 బస్తాలు, నలమెల గంగారెడ్డి 146 బస్తాలు, మగ్గిడి ప్రవీణ్ రెడ్డి 155 బస్తాలు, బద్దం సుగుణ 36 బస్తాల ధాన్యాన్ని విక్రయించారు. బస్తా బరువులో కలిపి 40కిలోల 700 గ్రాములు తూకం వేయాలి. కానీ రైతులే ముందుకొచ్చి ఒక కిలో తరుగు తీయడానికి ఒప్పుకున్నారు. ఇందుకు బస్తా బరువుతో కలిపి మొత్తం 41 కిలోల 700 గ్రాములు తూకం వేశారు. ఇటీవల ఈ ఐదుగురు రైతులవి కలిపి మొత్తం 600 బస్తాలను లారీలో ఎక్కించి నిజామాబాద్ నగరానికి దగ్గర్లో ఉన్న ఒక మిల్లుకు పంపించారు. అక్కడికి వెళ్లిన తర్వాత మిల్లర్ 593 బస్తాలనే పరిగణలోకి తీసుకుని ఏడు బస్తాలు తరుగు తీశాడని రైతులు ఆరోపిస్తున్నారు. కడ్తా తీయకుండా చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరుతున్నారు.

కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ

- జిల్లావ్యాప్తంగా 25 కేజీబీవీల్లో 94 శాతం ఉత్తీర్ణత
- 12 పాఠశాలల్లో వంద శాతం పాస్



ఆర్మూర్: జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయా(కేజీబీవీ)ల్లో విద్యార్థినులు పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబర్చారు. జిల్లా వ్యాప్తంగా 12 కేజీబీవీల్లో వంద శాతం ఫలితాలను సాధించారు. జిల్లాలోని 25 కేజీబీవీలను తెలంగాణ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం 833 మంది బాలికలు పదో తరగతి పరీక్షలు రాయగా 783 మంది ఉత్తీర్ణత సాధించగా 50 మంది ఫెయిల్ అయ్యారు. దీంతో జిల్లా వ్యాప్తంగా కేజీబీవీల్లో 94 శాతం ఉత్తీర్ణత నమోదైందని డీఈవో దుర్గాప్రసాద్, సెక్టోరల్ ఆఫీసర్ (జీసీడీవో) సింగం వనిత తెలిపారు. బాల్కొండ, బోధన్, ఇందల్‌వాయి, జక్రాన్‌పల్లి, మాక్లూర్, మెండోర, మోపాల్, ముప్కాల్, నందిపేట, నిజామాబాద్, సిరికొండ, వేల్పూర్ కేజీబీవీల్లో బాలికలు వంద శాతం పాసయ్యారు. ఆర్మూర్, ఇందల్వాయి కేజీబీవీల్లో ఇద్దరు విద్యార్థినులు పది జీపీఏ సాధించారు. కాగా వర్ని కేజీబీవీ 61 శాతం ఉత్తీర్ణతతో చివరి స్థానంలో నిలిచింది. ఈ పాఠశాలలో 31 మంది విద్యార్థినులు పరీక్ష రాయగా 19 మంది పాస్ అయ్యారు.

వంద శాతం ఫలితాలు సాధిస్తాం



కేజీబీవీ విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో చక్కని ఫలితాలను సాధించారు. రానున్న విద్యా సంవత్సరంలో వంద శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా చర్యలు తీసుకుంటాం.

– సింగం వనిత, సెక్టోరల్ ఆఫీసర్, నిజామాబాద్

రిజర్వేషన్ల రద్దుకు బీజేపీ కుట్ర



మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్

- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కులగణన
- ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి

ఖలీల్‌వాడి: రిజర్వేషన్ల రద్దుకు బీజేపీ కుట్ర పన్నుతుందని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ పదేళ్లలో చేసిందేమి లేదన్నారు. పసుపు బోర్డు గెజిట్ విడుదల చేసినా ఎక్కడ అన్నది స్పష్టం చేయడం లేదని విమర్శించారు. జిల్లాలో మెడికల్ కాలేజీ, తెలంగాణ యూనివర్సిటీ, ఎత్తిపోతల పథకాలు తీసుకువచ్చింది కాంగ్రెస్ పార్టీనే అని గుర్తు చేశారు. బీఆర్ఎస్, బీజేపీలు జిల్లాకు ఏమి చేశాయో చూపించాలని డిమాండ్ చేశారు. రెండు వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడానికి బీజేపీ యత్నిస్తుందని ఆరోపించారు. తొలి రెండు దశల్లో జరిగిన ఎన్నికల్లో సీట్లు రావని గ్రహించిన బీజేపీ మతవిద్వేషాలు రెచ్చగొడుతుందని ఆరోపించారు. ఇండియా కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కులగణన చేపడుతామన్నారు. నిజామాబాద్‌లో కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్‌హందాన్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కేశ వేణు, పీసీసీ కార్యదర్శి గడుగు గంగాధర్, భక్తవత్సలం(ఢిల్లీ), రామర్తి గోపి, వీక్కీయాదవ్ పాల్గొన్నారు.

ఏడాదిలో నవోదయ మంజూరు చేయిస్తా

- ఎంపీ ధర్మపురి అర్వింద్

సిరికొండ/ధర్పల్లి: జిల్లాలో ఏడాదిలోగా నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయిస్తానని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. సిరికొండ మండల కేంద్రం, ధర్పల్లి మండలం హొన్నాజీపేట గ్రామంలో మంగళవారం రాత్రి నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి హామీలను అమలు చేయమంటే దేవుళ్ల మీద ప్రమాణం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. హామీలను అమలు చేయకపోతే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్నెళ్లలో కూలిపోతుందని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో గల్ఫ్ సమస్యలపై హామీ ఇవ్వకుండా పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రకటించడం గల్ఫ్ బాధితులను మోసం చేయడానికే అని ఎంపీ విమర్శించారు. పసుపు ఆధారిత కంపెనీలను ఏర్పాటు చేయిస్తానని, జక్రాన్‌పల్లిలో ఎయిర్‌పోర్టు, జిల్లాలో డ్రైపోర్టు ఏర్పాటు చేయిస్తానని అర్వింద్ హామీ ఇచ్చారు. ప్రధాని మోదీ దేశంలో నాలుగు కోట్ల ఇళ్లు కట్టించారని, కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఒక్క ఇల్లు కట్టిచ్చే పరిస్థితుల్లో లేదన్నారు. మరో మారు బీజేపీకి ఓటు వేసి నరేంద్రమోదీని ప్రధాని చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సిరికొండ మండలం దుప్య తండా, కుర్దుల్‌పేట్, న్యావనంది, కొండూర్ గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు ఎంపీ సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్, ఇండియన్ పీపుల్స్ ఫోరం కన్వీనర్ జితేందర్ వైద్య, పార్లమెంట్ కన్వీనర్ గద్దె భూమన్న, రాజేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్, రాజేశ్వర్, రామస్వామి, గోపి, రాజేందర్, బాబురావు, సంజీవ్‌రెడ్డి, తాళ్ల శ్రీనివాస్, శ్రావణ్‌రెడ్డి, శంకర్ పాల్గొన్నారు.



సిరికొండలో మాట్లాడుతున్న ఎంపీ ధర్మపురి అర్వింద్

ధర్మాస్పత్రిలో దర్జాగా రిఫరల్ దందా

- ప్రైవేట్ ఆస్పత్రులకు రోగుల తరలింపు
- కమీషన్ల కోసం కక్కుర్తి
- పర్యవేక్షణ మరిచి చోద్యం చూస్తున్న అధికారులు

ఆర్మూర్ డివిజన్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన రాములు(పేరు మార్చాం) ఆర్థో సంబంధిత చికిత్స కోసం ఇటీవల జీజీహెచ్‌లో చేరాడు. రెండురోజుల చికిత్స అనంతరం సదరు వ్యక్తితో ఆస్పత్రికి చెందిన వారు. ఇక్కడ సరైన పరికరాలు లేవు. ఏదైనా అవసరమైతే బయటి నుంచి కొనుక్కోవాల్సి ఉంటుంది. ఇక్కడ ఉన్నా.. ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లినా అంతే ఖర్చవుతుందని చెప్పారు. అనంతరం బయటి నుంచి అంబులెన్స్‌ను తెప్పించి ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.



నిజామాబాద్ నాగారం : ధర్మాస్పత్రిపై ఎన్నో ఆశలతో వైద్యం కోసం వస్తున్న రోగులను ‘ప్రైవేట్’ ఉచ్చులోకి నెడుతున్నారు. రోగులను ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్ చేయడం జీజీహెచ్‌లో సాధారణ విషయంగా మారింది. పర్యవేక్షించాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి రోగుల తాకిడి భారీ సంఖ్యలో ఉంటుంది. ప్రతిరోజూ సుమారు 1200 మందికిపైగా చికిత్స కోసం ఆస్పత్రికి వస్తుండగా, సుమారు 30 నుంచి 50 మంది వరకు అడ్మిట్ అవుతున్నారు. అయితే, చికిత్స మొదలైన తొలిరోజు నుంచే రోగిని ‘ప్రైవేట్’ చికిత్స వైపు తీసుకువెళ్లేలా ప్రయత్నాలు మొదలు పెడుతున్నారు. ఇందులో భాగంగా రోగి బంధువులు, సహాయకుల అమాయకత్వాన్ని వాడుకుంటున్నారు. రోగికి మెరుగైన చికిత్స అందించాలని, పరిస్థితి విషమంగా ఉందని.. ఇలా ఎన్నో మాటలు చెబుతూ ప్రతిరోజూ అర్ధరాత్రి వేళల్లో ఒకరిద్దరిని ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. ఇలా.. జీజీహెచ్‌లో విధులు నిర్వర్తిస్తున్న కొంతమంది సిబ్బంది, వైద్యులు ‘రిఫరల్ దందా’ చేస్తూ ప్రైవేట్ ఆస్పత్రుల నుంచి ఒక్కో బిల్లులో నుంచి సుమారు 30 నుంచి 40శాతం వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇదంతా సంబంధిత అధికారులకు తెలిసినా చూసీచూడనట్లు ఉంటున్నారని పలువురు అంటున్నారు. అత్యవసర చికిత్స పేరుతో రోగులను ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించడం గత కొన్ని నెలలుగా జోరుగాసాగుతోంది. కమీషన్లలో కొంతమంది అధికారులకు కూడా వాటా ఉండడంతోనే ఎవరూ పట్టించుకోవడం లేదని రోగుల బంధువులు ఆరోపిస్తున్నారు. రోగుల తరలింపునకు ప్రత్యేకంగా ప్రైవేట్ అంబులెన్స్‌లు సైతం జీజీహెచ్ ఆవరణలోనే రాత్రుల్లో ఎక్కువగా ఉంటున్నాయి. జీజీహెచ్ నుంచి ప్రైవేట్ ఆస్పత్రులకు తరలిస్తున్న వారిలో ఎక్కువ మంది ఆర్థో, న్యూరో సంబంధిత రోగులు ఉంటున్నారు.

రాత్రి వేళల్లో తరలింపు



రోగులను జీజీహెచ్ నుంచి ప్రైవేట్ ఆస్పత్రులకు రాత్రి వేళల్లో తరలిస్తున్నారు. ఆస్పత్రిలోని కొంత మంది సిబ్బంది కమీషన్ల కోసం కక్కుర్తిపడుతున్నారు. ప్రభుత్వం ఎంతో ఖర్చు చేసి అత్యాధునిక పరికరాలను జీజీహెచ్‌లో అందుబాటులో ఉంచింది. మెరుగైన చికిత్స ఇక్కడే అందించే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించడం సరికాదు. ప్రైవేట్ ఆస్పత్రులతో కుమ్మక్కైన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి.

– సమీర్, ఆప్ పార్టీ నాయకుడు

కార్మికుల బతుకుల్లో కాంతులు నిండేనా..

- తెలంగాణ రాష్ట్రంలోనూ తీరని కష్టాలు
- శ్రమకు తగ్గ ఫలితం లేదంటున్న పారిశుధ్య కార్మికులు
- పన్నులు వసూలు అయితేనే పంచాయతీల్లో వేతనాలు

ఆర్మూర్: కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ శాఖను ఏర్పాటు చేసినా... కార్మికుల పక్షాన పోరాటాలు చేయడానికి అనేక యూనియన్‌లు పుట్టుకొని వచ్చినా కార్మికుల బతుకుల్లో మాత్రం కాంతులు నిండటం లేదు. ప్రత్యేక రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినా తమ బతుకులు మారేనా అని కార్మికులు పదేళ్లుగా ఆశగా ఎదురు చూస్తున్నారు. మే ఒకటవ తేదీన ప్రపంచ వ్యాప్తంగా కార్మిక దినోత్సవాన్ని ఎంతో ఘనంగా జరుపుకుంటున్నా కార్మికుల బతుకులు కష్టాల్లోనే మగ్గిపోతున్నాయి.

నిజామాబాద్ కార్పొరేషన్, ఆర్మూర్, బోధన్, భీమ్‌గల్ మున్సిపాలిటీలతో పాటు జిల్లాలోని గ్రామ పంచాయతీల పరిధిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు చాలీచాలని జీతాలతో నెట్టుకొస్తున్నారు. సఫాయి కార్మికుల జీతభత్యాలు పంచాయతీల ఆదాయం పై ఆధారపడి ఉండటంతో రోజుకు ఎనిమిది గంటలు పని చేసినా కార్మికులకు నెలకు రూ. రెండు వేలకు మించి వేతనం రావడం లేదు. పన్నులు సరిగా వసూలు కాని పంచాయతీలలో మాత్రం కార్మికులకు వేతనాలు కూడా సరిగా అందడం లేదు. పారిశుధ్య కార్మికులకు పంచాయతీల ఆదాయం, పన్నుల వసూళ్లతో సంబంధం లేకుండా వేతనాలను ప్రభుత్వం చెల్లిస్తే వేతనాలు పెరిగే అవకాశం ఉంది. మున్సిపాలిటీతో పాటు పంచాయతీ పరిధిలోని వార్డులలో మురికి కాలువలు తీయడం, వీధులను శుభ్రం చేయడం పారిశుధ్య కార్మికుల విధి. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచే తమకు కనీస వేతనాలు అమలు కావడం లేదని వాపోతున్నారు.



జిల్లాలో వ్యవసాయం తరువాత ఎక్కువ మంది బీడీ పరిశ్రమను నమ్ముకొని జీవిస్తున్నారు. బీడీ కార్మికులకు వెయ్యి బీడీలు చుడితే రూ. 110 కూలీ లభిస్తున్నా యాజమాన్యాలు అనుసరిస్తున్న తీరుతో చేతి నిండా పని లేకుండా పోయింది. యాజమాన్యాలు, కమీషన్ ఏజంట్లు ఒక్కటై కార్మికులను నిబంధనల ప్రకారం పని కల్పించకుండా వర్గీ బీడీని ప్రోత్సహిస్తున్నారు. బీడీలు చుట్టేందుకు కార్మికులు ముందుకు వచ్చినా వర్గీ బీడీల వల్ల వెయ్యి బీడీలకు సంగం కూలీ తీసుకోవాల్సి వస్తోంది. యాజమాన్యాలు బీడీ కార్మికుల కడుపును కొడుతున్నా కార్మిక శాఖ గాని, యూనియన్‌లు గాని చేసింది ఏమి లేదు. మరో వైపు గ్రామ పంచాయతీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు, బీడీ కార్మికుల వేతనాలకంటే ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల పరిస్థితి బాగుంది. కూలీలకు పని సమయం తక్కువగా ఉన్నా రోజు కూలీ లభిస్తుండడంతో ఉపాధి హామీ పనులు భేషుగ్గా ఉన్నాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి కార్మికుల జీవితాల్లో వెలుగు నింపాలని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా

కాంగ్రెస్ లీగల్ సెల్ రాష్ట్ర వైస్‌చైర్మన్‌గా దయాకర్‌గౌడ్



ఖలీల్‌వాడి: కాంగ్రెస్ లీగల్ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా దయాకర్ గౌడ్‌ను నియమిస్తూ అధ్యక్షుడు పొన్నం అశోక్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. కాంగ్రెస్‌లో సీనియర్ నాయకుడిగా గుర్తింపు పొందిన దయాకర్‌గౌడ్ జిల్లా కోర్టులో న్యాయవాదిగా పని చేస్తున్నారు. తాను పార్టీకి అందించిన సేవలకు గుర్తింపుగా రాష్ట్ర లీగల్ సెల్ వైస్‌చైర్మన్‌గా నియమించినందుకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నానని దయాకర్‌గౌడ్ అన్నారు.

బోటనీ విభాగంలో డాక్టరేట్



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ వృక్షశాస్త్ర (బోటనీ) విభాగంలో కే.రేఖ డాక్టరేట్ పొందారు. ప్రొఫెసర్ ఎం.మమత పర్యవేక్షణలో 'స్టడీస్ ఆన్ అర్బస్క్యులర్ మైకోరైజల్ ఫంగి అండ్ యాంటిమైక్రోబియల్ యాక్టివిటీ ఆఫ్ కెథరాంథస్ రోజియస్ ఎట్ నిజామాబాద్ డిస్ట్రిక్ట్, తెలంగాణ' అనే అంశంపై రేఖ పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. మంగళవారం తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ సెమినార్ హాల్‌లో నిర్వహించిన వైవావోస్‌కు ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.శైలజ ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. డాక్టరేట్ సాధించిన రేఖను తెయూ రిజిస్ట్రార్ ఎం.యాదగిరితోపాటు ప్రిన్సిపల్ ఆరతి, వృక్షశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ ఎం.అరుణ, బీవోఎస్ చైర్మన్ ప్రొఫెసర్ విద్యావర్థిని, అధ్యాపకులు ఎంఏ హలీమ్‌ఖాన్, దేవరాజు శ్రీనివాస్, వి.జలంధర్ తదితరులు అభినందించారు.

ప్రైవేట్ ఆస్పత్రిపై విచారణ

నిజామాబాద్‌నాగారం: నగరంలోని ఖలీల్‌వాడిలో ఉన్న కీర్తిసాయి ఆస్పత్రి డాక్టర్ వైద్యం వికటించి ఇటీవల గర్భిణి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై మంగళవారం విచారణ ప్రారంభించారు. మాక్లూర్ మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆశిష్ ఆధ్వర్యంలో విచారణ కొనసాగగా, నివేదికను వైద్యారోగ్యశాఖకు అందించనున్నారు. బాధిత కుటుంబానికి పరిహారం ఇచ్చినట్లు తేలగా, డాక్టర్‌తోపాటు ఆస్పత్రిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో త్వరలో తేలనుంది.

'పది'లో మెరిసిన ప్రైవేట్ విద్యార్థులు

- వందశాతం ఉత్తీర్ణత సాధించిన 85 పాఠశాలలు
- 181 మంది విద్యార్థులకు 10 జీపీఏ



10 జీపీఏ సాధించిన శ్రీచైతన్య విద్యార్థి జాగృతిని అభినందిస్తున్న డీఈవో దుర్గాప్రసాద్

నిజామాబాద్‌అర్బన్: పదో తరగతి ఫలితాల్లో జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. 181 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించగా, ఇందులో బాలురు 52 మంది, బాలికలు 129 మంది ఉన్నారు. 85 ప్రైవేట్ పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి.

కాకతీయకు ఉత్తమ ఫలితాలు

జిల్లా కేంద్రంలోని కాకతీయ ఒలంపియాడ్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థులకు 10జీపీఏ వచ్చింది. టి.నిత్యశ్రీ, రితేశ్‌రెడ్డి, కె.జాసన్, నిత్యసహా, బి.హాసిని, ఎం.అశ్రిత, ఎ.వచన్, వై.శ్రీహిత 10 జీపీఏ సాధించినవారిలో ఉన్నారు. 9.8 జీపీఏ 33 మందికి, 9.7 గ్రేడ్ 60, 9.5 గ్రేడ్ 144, 9.3 గ్రేడ్ 220 మంది సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ తేజస్విని ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. అనుభవజ్ఞులైన టీచర్లతో స్కూల్ స్థాయి నుంచి ఐఐటీ ఫౌండేషన్ కోర్సు అందిస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ శిక్షకుల ఆధ్వర్యంలో బోధన కొనసాగుతోందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధిస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నటరాజ్, గిరిధర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విజయ్ స్కూల్..

నగరంలోని విజయ్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించారని, వంద శాతం ఉత్తీర్ణత నమోదైందని పాఠశాల కార్యదర్శి అమృతలత ఒక ప్రకటనలో తెలిపారు. బి.అక్షయ, అశ్విని, లాస్యశ్రీ, మదీహానాజ్, షైనిక, శ్రీచరణి, శ్రీవల్లి తదితరులు 10 జీపీఏ సాధించినట్లు వివరించారు. విద్యార్థులను కరస్పాండెంట్ ప్రభావతితో పాటు అమృతలత ఘనంగా సన్మానించారు.

ఎస్ఆర్ విద్యార్థులు..

తమ పాఠశాల విద్యార్థులు ఎండీ సనాం, జి.అభిఘ్న, విఠల్, హర్షిత్‌రెడ్డి, స్వంజన, వెంకట ప్రసూన్ తదితరులు 10జీపీఏ సాధించినట్లు నగరంలోని ఎస్ఆర్ పాఠశాల జోనల్ ఇన్‌చార్జి ప్రణీత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 16 మంది విద్యార్థులు 9.8గ్రేడ్, 18 మంది 9.7గ్రేడ్ సాధించినట్లు వివరించారు.

అభ్యాస, విశ్వవికాస్, నలంద, సెయింట్ జేవియర్..

అభ్యాస పాఠశాల విద్యార్థి కార్తీక 10జీపీఏ సాధించింది. గాయత్రినగర్‌లో గల విశ్వవికాస్ పాఠశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ సుస్మిత తెలిపారు. కె.కీర్తి 10జీపీఏ సాధించిందన్నారు. నలంద పాఠశాలకు చెందిన మేఘన, సాత్విక, చింతసాత్విక్ 10జీపీఏ సాధించినట్లు కరస్పాండెంట్ మురళీకృష్ణ తెలిపారు. అలాగే సెయింట్ జేవియర్ పాఠశాలకు చెందిన విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కరస్పాండెంట్ నర్సింహారావు తెలిపారు. సాహితీ, అస్మిత 9.8 జీపీఏ సాధించినట్లు తెలిపారు.

శ్రీచైతన్య విద్యార్థులకు అభినందన

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన నగరంలోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులను జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ మంగళవారం అభినందించారు. 10 జీపీఏ సాధించిన విద్యార్థుల తోపాటు పాఠశాల సిబ్బంది డీఈవోను కలిశారు.

పక్కా ప్రణాళికతో సక్సెస్

నిజామాబాద్‌అర్బన్: పదోతరగతి ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి సక్సెస్‌ను అందుకున్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల అభిప్రాయాలు వారి మాటల్లో..

టీచర్ల పర్యవేక్షణ..



ప్రణాళికాబద్ధంగా చదివి మంచి మార్కులు సాధించాను. 9 గంటల పాటు చదివేదాన్ని. టీచర్ల పర్యవేక్షణ కారణంగా ఎలాంటి సందేహాలు లేకుండా పోయాయి. ఐఐటీ ఫౌండేషన్ అందుబాటులో ఉండడంతో పరీక్షలు తేలికగా రాయగలిగాను. భవిష్యత్‌లో మరిన్ని మార్కులు సాధిస్తా.

– నిత్యశ్రీ, కాకతీయ ఒలంపియాడ్

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో..



అమ్మానాన్నల ప్రోత్సాహంతో 10జీపీఏ సాధించాను. దానికితోడు పాఠశాల టీచర్లందరూ నిరంతరం పర్యవేక్షణ చేశారు. వారి సలహాలు, సూచనలను పాటిస్తూ తల్లిదండ్రుల ప్రోత్సాహంతో మంచి మార్కులు సాధించాను. ఎంతో సంతోషంగా ఉంది.

– నిత్యసహా, కాకతీయ ఒలంపియాడ్

ఐఐటీ సీటు సాధిస్తా



నిరంతర పర్యవేక్షణ కారణంగా మంచి మార్కులు సాధించాను. నేను చిన్ననాటి నుంచి కాకతీయ ఒలంపియాడ్ స్కూల్‌లో చదువుతున్నాను. ప్రణాళికాబద్ధంగా తరగతుల నిర్వహించడంతోనే మంచి మార్కులు సాధించాను. ఐఐటీ సీటు సాధించాలనేది నా కల. దానికి అనుగుణంగా చదువుతున్నాను.

– ఎం.అశ్రిత, కాకతీయ ఒలంపియాడ్ స్కూల్

సందేహాలు నివృత్తి చేశారు



అన్ని సబ్జెక్టుల టీచర్లు ఎప్పటికప్పుడు సందేహాలను నివృత్తి చేశారు. తరచుగా టెస్టుల నిర్వహించడం ఎంతగానో ఉపయోగపడింది. రొబొటిక్స్ వంటి సాంకేతిక విద్య అందించడం వల్ల మంచి మార్కులు సాధించాను. భవిష్యత్‌లో మరిన్ని మార్కులు సాధిస్తాను.

– రితేశ్‌రెడ్డి, కాకతీయ ఒలంపియాడ్

ఒత్తిడి లేకుండా చదివాను



పాఠశాలలో ఎలాంటి ఒత్తిడి లేకపోవడంతో తేలికగా చదివాను. మంచి మార్కులు సాధించాలని ముందుగానే అనుకున్నాను. దానికి అనుగుణంగా టీచర్లు ఎంతో సహకరించారు. తేలికైన బోధన అందించడంతో ఒత్తిడి లేకుండా మంచి మార్కులు సాధించాను.

– బి.అక్షయ, విజయ్ పబ్లిక్ స్కూల్

ఎంతో సంతోషంగా ఉంది



10 జీపీఏ సాధించడం ఎంతో ఆనందంగా ఉంది. మా తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా మంచి మార్కులు సాధించాను. భవిష్యత్‌లో మంచి మార్కులు సాధించి పేరుప్రఖ్యాతలు సాధిస్తా. ఇదే ఉత్సాహంతో మరింత మంచిగా చదువుతా.

– యశస్విని, విజయ్ పబ్లిక్ స్కూల్

నిత్యం ప్రాక్టీస్ చేసేదాన్ని



మంచి మార్కుల సాధించాలనే లక్ష్యంతో చదివాను. ప్రతిరోజూ పాఠశాలలో ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు బోధించిన తరువాత ఇంటికి వచ్చి ప్రాక్టీస్ చేసేదాన్ని. దీంతో సబ్జెక్ట్ ఎక్కువగా గుర్తుండేది. ఇదే విధానంతో అన్ని సబ్జెక్టులు చదివి మంచి మార్కులు సాధించాను.

– ఎ.సంజన, శ్రీఅరబిందో హైస్కూల్

సౌత్‌జోన్ సాఫ్ట్‌బాల్‌లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

- జాతీయస్థాయిలో చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్న రాష్ట్ర జట్టు
- బాలికల జట్టుకు బంగారు పతకం, బాలుర జట్టుకు రజతం



జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులు

నిజామాబాద్‌నాగారం: కర్ణాటకలోని తుంకూర్‌లో ఏప్రిల్ 28 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించిన 3వ జూనియర్ సౌత్‌జోన్ జాతీయ చాంపియన్‌షిప్ పోటీల్లో రాష్ట్ర బాలికల జట్టు ప్రథమ స్థానం(బంగారు పతకం), బాలుర జట్టు ద్వితీయ స్థానంలో(రజతపతకం) నిలిచాయి. రాష్ట్ర జట్ల విజయంలో జిల్లా క్రీడాకారులు కీలకపాత్ర పోషించి పలువురి ప్రశంసలు అందుకున్నట్లు జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వి ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగామోహన్ తెలిపారు. బాలికల విభాగంలో జూనియర్ సౌత్ జోన్ బెస్ట్ ఆల్ రౌండర్‌గా వైశాలి ప్రత్యేక బహుమతిని అందుకుంది. క్రీడాకారులను రాష్ట్ర సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కే శోభన్‌బాబు, రాష్ట్ర సాంఘిక సంక్షేమ విద్యా సంస్థల స్పోర్ట్స్ ఆఫీసర్ డాక్టర్ రామలక్ష్మయ్య, నోడల్ ఆఫీసర్ శేషుకుమారి ప్రత్యేకంగా అభినందించారు.

జాతీయస్థాయిలో ప్రతిభచాటిన క్రీడాకారులు వీరే..

బాలికల విభాగం: జి.వైశాలి, జి.సాత్విక, జి శ్రావిక, టి.నేహశ్రీ (సాంఘిక సంక్షేమ కళాశాల, సుద్దపల్లి), ఎస్.సౌమ్యారాణి (సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల, తాడ్వాయి), ఎస్.వైశాలి (సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల ఆర్మూర్).

బాలుర విభాగం: సిద్ధార్థ (సత్యశోధక్ పాఠశాల, సిరికొండ), తిరుపతి (సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల, ఉప్పల్‌వాయి).

పదవీ విరమణ పొందిన సిబ్బందికి వీడ్కోలు



పదవీ విరమణ పొందిన సిబ్బందిని సన్మానిస్తున్న సీపీ కల్మేశ్వర్

ఖలీల్‌వాడి: పోలీస్ శాఖలో విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన సిబ్బందిని సీపీ కల్మేశ్వర్ మంగళవారం తన కార్యాలయంలో సన్మానించి వీడ్కోలు పలికారు. అనంతరం జ్ఞాపికలను అందజేశారు. పదవీ విరమణ పొందిన వారిలో సీపీ కార్యాలయం సూపరింటెండెంట్ సయ్యద్ మక్సూద్ అహ్మద్, ఎస్బీ ఎస్సై జి.మనోహరరావు, నాల్గో టౌన్ ఏఎస్సై నర్సింహరావు, ఏఆర్ఎస్సై హెచ్.నాగేశ్వర్, హెడ్‌కానిస్టేబుల్ పి. రమణారెడ్డి ఉన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్) బి.కోటేశ్వరరావు, ఏసీపీ శేషాద్రిరెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ ఎస్.శ్రీనివాస్ రావు, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఏసీపీ కె.నాగయ్య, ఎస్బీ సీఐ శ్రీశైలం, రిజర్వ్ సీఐ (అడ్మిన్) డి.వెంకట్, ఆఫీస్ సూపరింటెండెంట్ శంకర్ తదితరులు ఉన్నారు.

చెక్కు అందజేత

వర్ని పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ మృతి చెందిన కానిస్టేబుల్ వెంకటేశ్ కుటుంబ సభ్యులకు పోలీస్‌భద్రతా స్కీముకు సంబంధించి రూ.1.88లక్షల చెక్కును సీపీ అందజేశారు. జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు షకీల్ పాషాతోపాటు బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్‌లో తనిఖీలు



స్కానింగ్ సెంటర్ వద్ద పోలీసులు

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని అయ్యప్ప స్కానింగ్ సెంటర్‌లో డీసీపీ శేషాద్రిరెడ్డి సిబ్బందితో కలిసి మంగళవారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. స్కానింగ్ సెంటర్‌కు రోజు ఎంత మంది వస్తారనే వివరాలు తెలుసుకొని సీసీ ఫుటేజీని పరిశీలించారు. ఈ సందర్భంగా స్కానింగ సెంటర్ వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వడదెబ్బతో వృద్ధురాలు మృతి



నిజాంసాగర్(జుక్కల్): కామారెడ్డి జిల్లా మహమ్మద్ నగర్ మండలంలోని గిర్నితండా గ్రామ పంచాయతీకి చెందిన కడావత్ హిరిబాయి(65) సోమవారం రాత్రి వడదెబ్బతో మృతి చెందింది. రెండు, మూడు రోజుల నుంచి వరిధాన్యాన్ని ఆరబెట్టిన హిరిబాయి ఎండ దెబ్బకు గురై ఆకస్మత్తుగా మృతి చెందిందని తండావాసులుల తెలిపారు.

తహసీల్దార్‌కు షోకాజ్ నోటీస్

ఆర్మూర్: ఆలూర్ తహసీల్దార్ నరేశ్‌కు ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్ మంగళవారం షోకాజ్ నోటీసు జారీ చేశారు. తహసీల్దార్‌పై అవినీతి ఆరోపణల నేపథ్యంలో నోటీసు జారీ చేసినట్లు ఆర్డీవో తెలిపారు.

క్రైం కార్నర్

ధాన్యం లారీ బోల్తా



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మున్సిపాలిటి పరిధిలోని గండిమాసానిపేట గ్రామ శివారులో కామారెడ్డి - ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై మంగళవారం వేకువజామున ధాన్యం లారీ బోల్తా పడింది. మండలంలోని మత్తమాల ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి కామారెడ్డికి ధాన్యం బస్తాలను తరలిస్తున్న లారీ బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు.

మక్కకంకులు దగ్ధం



భిక్కనూరు: మండలంలోని మల్లుపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో 35 క్వింటాళ్ల మక్క కంకులు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన మాలే దుర్గయ్య తన వ్యవసాయ క్షేత్రం వద్ద మక్కజూడును తీసి కంకులను ఒక దగ్గర పోశాడు. ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించి రూ.85వేల విలువైన కంకులు పూర్తిగా కాలిపోయాయి. విషయం తెలుసుకున్న ఎంపీటీసీ సభ్యుడు మోహన్‌రెడ్డి ప్రమాదస్థలానికి వెళ్లి బాధిత రైతు దుర్గయ్యను పరామర్శించి ఓదార్చారు.

టాస్క్‌ఫోర్స్ అదుపులో ఫైనాన్షియర్?

ఖలీల్ వాడి: నగరానికి చెందిన బైక్ ఫైనాన్షియర్ ఒకరిని మంగళవారం జిల్లా కోర్టు సమీపంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. సదరు వ్యక్తి బైక్‌లు, కార్లు తనాఖా పెట్టుకొని ఫైనాన్స్ చేస్తున్నారనే ఫిర్యాదు మేరకు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఎంత మంది కలిసి ఫైనాన్స్ నడుపుతున్నారని విచారణ చేపట్టినట్లు తెలిసింది. ఈ విషయమై టాస్క్‌ఫోర్స్ సీఐ అంజయ్యను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

రైలుకిందపడి ఒకరి ఆత్మహత్య

ఖలీల్‌వాడి: అప్పుల బాధ భరించలేక రైలుకిందపడి ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం 6 గంటలకు అమ్మవెంచర్ సమీపంలోని రైలుపట్టాలపైకి వెళ్లి ఆర్యనగర్‌కు చెందిన రాజవరపు శ్రీనివాస్ (50) ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నటు తెలిపారు.

రుద్రూర్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

రుద్రూర్: మండల కేంద్రం శివారులోని కామధేను రైస్‌మిల్ వెనుక గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై అప్పారావు తెలిపారు. మృతుడు మెడలో హన్మంతుడి లాకెట్, తెల్లని మొలతాడు, లుంగీ ధరించి ఉన్నాడని వివరించారు. మృతుని వివరాలు తెలిస్తే పోలీస్‌స్టేషన్‌లో లేదా 87126 59785 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి



కార్తీక్ (ఫైల్)

ఎడపల్లి (బోధన్): మండలంలోని అశోక్‌సాగర్ దర్గా వద్ద సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జానకంపేటకు చెందిన కార్తీక్(20), అర్బాస్ ఖురేషీ నెహ్రూనగర్‌లో జరిగిన వివాహానికి హాజరై బైక్‌పై తిరిగి వస్తుండగా.. బోధన్ వైపు నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న కార్తీక్ ఎగిరి అశోక్‌సాగర్ చెరువు పక్కన, తలకు, శరీర భాగాలకు తీవ్రగాయాలై అర్బాస్ ఖురేషీ రోడ్డుపై పడిపోయారు. ప్రమాదంలో ఒక్కడే ఉన్నట్లు భావించిన స్థానికులు అర్బాస్‌ను నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కార్తీక్‌ను ఎవరూ మరుసటి రోజు మధ్యాహ్నం 12గంటల వరకు ఎవరూ గమనించలేదు. అనుమానం వచ్చిన తల్లిదండ్రులు బైక్ కార్తీక్‌ది కావడంతో ప్రమాదం జరిగిన ప్రాంతంలోని పరిసరాల్లో వెతకగా మృతదేహం లభించింది. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని కార్తీక్ మృతదేహాన్ని బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బైక్ అదుపు తప్పిన ఘటనలో మరొకరు..



ఘటనాస్థలంలో నర్సింలు మృతదేహం

బాల్కొండ: మండలంలోని చిట్టాపూర్ శివారులో జాతీయ రహదారి 44పై బైక్ అదుపు తప్పిన ఇత్వార్‌పేట్‌కు చెందిన గజ్జల నర్సింలు (34) మృతి చెందాడు. బాల్కొండ ఎస్సై గోపి తెలిపిన వివరాల ప్రకారం.. నెలరోజుల క్రితం నర్సింలు జలాల్‌పూర్ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడగా చేయి విరిగింది. చేయికి ఉన్న కట్టును మార్పించుకునేందుకు మంగళవారం కిసాన్‌నగర్‌కు చెందిన మిత్రుడు చక్రధారి శ్రావణ్‌కుమార్‌తో కలిసి బైక్‌పై ఆర్మూర్‌కు వెళ్తుండగా చిట్టాపూర్ శివారులో బైక్ అదుపు తప్పింది. ఈ ఘటనలో తలకు తీవ్రగాయాలై నర్సింలు అక్కడికక్కడే మృతి చెందగా, శ్రావణ్‌కుమార్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తి..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలకేంద్రంలోని కామారెడ్డి - ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై బైక్ ఢీకొట్టిన ఘటనలో లింగంపేట్ మండలం మోతె గ్రామానికి చెందిన అగ్గు సాయన్న(70) మృతి చెందాడు. మంగళవారం రాత్రి జరిగిన ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని ఎర్రాపహాడ్‌కు చెందిన గోపాల్ తన భార్యతో కలిసి బైక్‌పై కామారెడ్డి నుంచి ఎర్రాపహాడ్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో మండల పరిషత్ సమీపంలో రోడ్డువెంబడి నడుచుకుంటూ వెళ్తున్న సాయన్న సడెన్‌గా బైక్‌కు అడ్డువచ్చాడు. ఈ ఘటనలో సాయన్న తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై ఉన్న గోపాల్ దంపతులకు సైతం తీవ్ర గాయాలుకావడంతో చికిత్స నిమిత్తం కామారెడ్డికి తరలించారు.

బెంచీ పైనుంచి పడి ఒకరు..

రెంజల్ (బోధన్): హోటల్‌లో టిఫిన్ చేస్తున్న వ్యక్తి ప్రమాదవశాత్తు బెంచీ పైనుంచి కిందపడి మృతి చెందిన సంఘటన మండలంలోని కూనేపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై సాయన్న తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గురప్ప (65) కుమారుడు సాయిలు బోధన్‌లో పని చేస్తూ అక్కడే ఉంటుండగా, ఒంటరిగా ఉంటున్న గురప్ప గ్రామంలో భిక్షాటన చేస్తూ జీవించేవాడు. ఇటీవల రెంజల్ దగ్గర బైక్ పైనుంచి పడిపోయిన గురప్ప అనారోగ్యం పాలయ్యాడు. అప్పటి నుంచి బోధన్‌లో కుమారుడి వద్ద ఉన్న ఆయన ఇటీవలే గ్రామానికి వచ్చాడు. మంగళవారం స్థానిక హోటల్‌లో టిఫిన్ చేస్తుండగా బెంచీ పైనుంచి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. గురప్ప ఎండదెబ్బ కారణంగా మృతి చెందాడా? లేక గతంలో అయిన గాయాల కారణంగా మృతి చెందాడా? అనేది పోస్టుమార్టంలో తేలుతుందని ఎస్సై అన్నారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చెట్టును ఢీకొట్టిన తుఫాన్

- ఏడుగురికి గాయాలు
- కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలింపు



ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

మాచారెడ్డి: చెట్టును తూఫాన్ వాహనం ఢీకొట్టిన ఘటనలో ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నారు. మండలంలోని ఘన్‌పూర్ స్టేజీ వద్ద మంగళవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాందెడ్‌కు చెందిన చంద్రకళ, సంతోష్, శశికళ, అశ్విని, భాగ్యశ్రీ, గణపతి, లక్ష్మణ్ కామారెడ్డి వైపు నుంచి తుఫాన్ వాహనంలో వేములవాడ వెళ్తున్నారు. ఈక్రమంలో కామారెడ్డి - సిరిసిల్ల రహదారిపై ఘన్‌పూర్‌స్టేజీ వద్ద వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనున్న చెట్టును ఢీ కొట్టి బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న ఏడుగురితోపాటు ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరి అదృశ్యం



బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం గ్రామానికి చెందిన మంద సాయిలు (55) అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. తన తండ్రి గత మూడు రోజులుగా కనిపించడం లేదని సాయిలు కుమారుడు సతీశ్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. అప్పులు చేస్తున్నాడని కుటుంబ సభ్యులు ఈనెల 27న మందలించారని, ఆ రోజు తిని పడుకున్న సాయిలు మరుసటి రోజు ఉదయం కనిపించ లేదని తెలిపారు. బంధువుల ఇళ్లు, చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా రాథోడ్‌నాయక్

నిజామాబాద్‌నాగారం: జిల్లా వైద్యారోగ్యశాఖ ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా డాక్టర్ రాథోడ్‌నాయక్ వ్యవహరించనున్నారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం డైరెక్టర్ ఆఫ్ హెల్త్ (డీహెచ్)రవీందర్‌నాయక్ నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. ప్రస్తుతం నిజామాబాద్ డివిజన్ డిప్యూటీ డీఎంహెచ్‌వోగా రాథోడ్‌నాయక్ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. పదేళ్లపాటు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా కొనసాగిన సుదర్శనం మంగళవారం పదవీవిరమణ పొందారు. దీంతో రాథోడ్ నాయక్‌ను నియమించారు.

కలెక్టర్ అనుమతితోనే..

రాథోడ్‌నాయక్‌కు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో బాధ్యతలను అప్పగిస్తూ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ జిల్లా కలెక్టర్ అనుమతి తప్పనిసరి కావడం చర్చనీయాంశమైంది. జిల్లాలో ఆర్మూర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్ సీనియర్ కాగా, కలెక్టర్ ఎవరికి అనుమతిస్తే వారే ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా కొనసాగనున్నారు. ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో నియామకానికి సంబంధించిన వ్యవహారం బుధవారం ఓ కొలిక్కిరానుంది.